

ఉత్సవానికి సిద్ధమైన భారీ విగ్రహం



రాజమహేంద్రవరంలో శ్యామలా థియేటర్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను విక్రయిస్తున్న దృశ్యం

జై జై గణేశా..

జిల్లా అంతటా వినాయక చవితి సందడి నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచే పూలు, పండ్లు, పత్రి, ప్రతిమల కోసం జనం మార్కెట్లలో క్యూకట్టారు. రాజమహేంద్రవరంతో పాటు అన్నిచోట్లా వ్యాపార కూడళ్లన్నీ కళకళలాడాయి. అదేవిధంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల కోసం ఉత్సవ పందిళ్లన్నీ సిద్ధమయ్యాయి. ఆయాచోట్ల భారీ విగ్రహాలను నెలకొల్పేందుకు ఉత్సవ కమిటీలు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నాయి. దీంతో శుక్రవారమే విగ్రహాల తయారీ ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో యువకులు ఆయా విగ్రహాలను తరలించుకు వెళ్లారు. ఇక పూజ కోసం వినియోగించే పూలకు భారీ డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో ప్రధానమైన కడియం పూల మార్కెట్‌తోపాటు పెరవలి మండలం కాకరపర్రు మార్కెట్‌లోనూ పూల ధరలు ఆకాశాన్నంటాయి.



రాజమహేంద్రవరంలో కంబాల చెరువు వద్ద చవితి మార్కెట్‌లో సందడి

- జిల్లా అంతటా వినాయక చవితి సందడి
- ఉత్సవ పందిళ్లలో నెలకొన్న పండుగ వాతావరణం
- ఇప్పటికే భారీ విగ్రహాలు తరలింపు
- మట్టి విగ్రహాలకు కొద్దిగా పెరిగిన ప్రాధాన్యం
- పూలు, పండ్లు, పత్రి, ప్రతిమల కోసం మార్కెట్లు జనంతో రద్దీ



రాజమహేంద్రవరంలో ఉత్సవాలకు తరలిస్తున్న విగ్రహం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా జిల్లా అంతటా పండుగ సందడి నెలకొంది. మార్కెట్లన్నీ కళకళలాడాయి. రాజమహేంద్రవరంలో వస్త్ర, బంగారం వ్యాపారాలు జోరుగా సాగాయి. ఇక మార్కెట్‌లో పూజా సామగ్రి కోసం జనం క్యూకట్టారు. నగరంలో ప్రధాన కూడళ్లలో పూలు, పండ్లు, పత్రి, ప్రతిమల విక్రయాలు పెద్దఎత్తున సాగాయి. ఈసారి వినాయకుడి చిన్న ప్రతిమల నుంచి పెద్ద విగ్రహాల వరకు మట్టితో చేసిన వాటికే ఎక్కువగా జనం, ఉత్సవ కమిటీలు ప్రాధాన్యం ఇచ్చాయి. అలాగే వివిధ రూపాల్లో ఉన్న గణేషుడి విగ్రహాలను ఏర్పాటుచేసేందుకు యువకులు ఉత్సాహంగా వాటిని కొనుగోలు చేశారు. పలుచోట్ల పర్యావరణహితాన్ని కాంక్షిస్తూ వ్యక్తులు, సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. నగరంలోని శ్యామలానగర్, పాతకూరగాయల మార్కెట్, డీలక్స్ సెంటర్, జాంపేట పూలమార్కెట్, కంబాలచెరువు సెంటర్, దేవీచౌక్ సెంటర్, జాంపేట గాంధీ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాలన్నీ చవితి పూజా సామగ్రి విక్రయాలు సాగుతుండడంతో సాయంత్రం ఆయా ప్రాంతాలు జనంతో నిండిపోయాయి. ఇక గణేష్‌చౌక్, నాళం భీమరాజు వీధి, లలితానగర్, తాలూకా ఆఫీసు,శ్యామలానగర్ వంటిచోట్ల ఉన్న వినాయక ఆలయాలతోపాటు, పుష్కర్ ఘాట్ తదితర చోట్ల గణపతి నవరాత్రి వేడుకల కోసం వివిధ రూపాల్లో, అనేక రంగుల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటుచేశారు. ప్రతిరోజూ గణపతి పూజలతోపాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి.

పూలమార్కెట్‌కు చవితి కళ



కడియపులంక అంతర్‌రాష్ట్ర పూలమార్కెట్

కడియం, సెప్టెంబరు 6: కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌కు చవితికళ ఏర్పడింది. కొనుగోలుదారులు, వ్యాపారులు, రైతులతో మార్కెట్‌కు కళకళలాడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ పూలమార్కెట్ పండుగ సందర్భాల్లో మరింత బిజీగా మారడం సహజమే. మల్లెలు, కాగడాలు, జాజులు, లిల్లీ పూలు ఈ ప్రాంతంలో లభిస్తుంటే, చామంతి, బంతి, పూలను తమిళనాడు, కర్ణాటక, కలకత్తా ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం చవితి డిమాండ్‌తో మార్కెట్‌లో ధరలు పెరిగాయి.



మల్లెలు (కిలో) రూ. 1,500
కాగడాలు (కిలో) రూ. 1,000
జాజులు (కిలో) రూ. 1,400
లిల్లీ (కిలో) రూ. 220
తమిళనాడు చామంతి (కిలో) రూ. 300
నీలం చామంతి (కిలో) రూ. 300
వైట్ చామంతి (కిలో) రూ. 350
కర్నాటక బంతి (కిలో) రూ. 70-100
కలకత్తా బంతి (కిలో) రూ. 100
కనకంబరం (బారు-1) రూ. 400
డచ్ (20పూలు) రూ. 350
స్టార్‌గులాబీ (కిలో) రూ. 300
సెంట్ గులాబీ(కిలో) రూ. 220

కాకరపర్రు పూల మార్కెట్‌లో..

పెరవలి, సెప్టెంబరు6: చవితి సందర్భంగా పూల ధరలు ఆకాశాన్నాంటాయి. కాకరపర్రు పూల మార్కెట్‌లో వివిధ రకాల పూలు ఎక్కువ రేటు పలికాయి. ఈ ప్రాంతంలో పండిన పువ్వులతోపాటు బెంగుళూరు, కడియం నుంచి వివిధ రకాల పువ్వులను దిగుమతి చేసినట్లు వ్యాపారులు పేర్కొన్నారు. కాకరపర్రు పూల మార్కెట్‌లో పూల ధరలు చూస్తే తెల్ల చామంతి కిలో రూ.400, పసుపు, ఎరుపు బంతి రూ.100, గులాబీలు రూ.250, చామంతి రూ.400, కనకాంబరం రూ.2200, జాజులు రూ.1700 ధర పలికాయి.



ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 6: జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలను కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణపతి ఉత్సవాలు చేసేవారు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతుగా భాగస్వాములు కావాలన్నారు. చవితి పండుగ జరుపు విధానంలో ప్రకృతిలో సహజంగా లభించే వాటితోనే చేయడం పురాతనకాలం నుంచి ఆచారంగా వస్తోందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తదితర నీటిలో కరగని వాటిని ఉపయోగించి తయారుచేసిన విగ్రహాలను పూజలో వినియోగించవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం సూచనలు పాటించాలని కోరారు. ప్రజలు సంతోషంగా వినాయక చవితి పండుగ జరపాలని ఆకాంక్షించారు.

పర్యావరణ హితం మట్టి వినాయకుడు

జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోరి జిల్లా ప్రజలు మట్టి వినాయక ప్రతిమలతో మాత్రమే చవితి పండుగ జరుపుకోవాలని ఎస్పీ నరసింహకిషోర్ పిలుపునిచ్చారు. వివిధ రసాయనాలతో చేసిన ప్రతిమల వల్ల నదులు కలుషితం కావడంతోపాటు పర్యావరణానికి చేటు జరుగుతోందన్నారు. అందువల్ల మట్టి ప్రతిమలను వినియోగించడం బాధ్యతగా భావించాలని కోరారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. తలపెట్టిన పనులు విఘ్నాలు లేకుండా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చవితి ఉత్సవాలు, నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు.



నిడదవోలులో ఉత్సవాలకు సిద్ధమైన పూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం

నిడదవోలులో 105వ గణపతి నవరాత్రి ఉత్సవాలకు సర్వంసిద్ధం!

నిడదవోలు, సెప్టెంబరు 6: నిడదవోలు పట్టణంలో గణేష్‌చౌక్ సెంటరుగా పేరుపొందిన పూజా గణపతి కుమారస్వామి వార్ల ఆలయంలో 105వ గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయానికి 195 సంవత్సరాలుగా గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆనాటి తరం ప్రతినిధి సిరదే సత్యం నుంచి ఈనాటి తరం ప్రతినిధి కారింకి సాయిబాబు గణపతి నవరాత్రులను అత్యంత ప్రతిష్టాత్మకంగా క్రమశిక్షణతో నిర్వహిస్తున్నారు. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు ఈ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. స్వామి వారు ఈ ప్రాంతంలో వెలిసి ఉండడంతో ఈ ప్రాంతం గణేష్‌చౌక్ సెంటరుగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ జరిగే గణపతి నవరాత్రుల్లో రాష్ట్రంలోని పలుచోట్ల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ స్వామి వారి ఆశీస్సులు అందుకొంటుంటారు. శనివారం ప్రారంభం కాబోతున్న 105వ గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పూజా కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది.



ఎస్పీ నరసింహకిషోర్



విద్యార్థుల మృతితో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)



చింతా కార్తీక్ (ఫైల్)

- మృతులు పల్నాడు జిల్లా సీవల్లిపురం, శ్రీకాకుళం జిల్లా పలాసవాసులు
- దివాన్‌చెరువులో ప్రమాదం.. ఆరోగ్యం బాగా లేక ఆస్పత్రికి వెళుతుండగా ఘోరం
- శోకసంద్రంలో తోటి విద్యార్థులు

- 6లో





రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు వద్ద మునిగిన ఘాట్లు.. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద దిగువకు వదిలిన వరద నీటి ప్రవాహం

తగ్గుతున్న వరద

- గోదావరి నీటిమట్టం దిగువకు
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- ప్రస్తుత బ్యారేజీ నీటిమట్టం 12 అడుగులు
- బ్యారేజీ నుంచి 10,21,195 క్యూసెక్కులు సముద్రంలోకి
- భద్రాచలం వద్దమొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- మళ్లీ మూడు రోజుల పాటు వర్షాల హెచ్చరిక

ధవళేశ్వరం, సెప్టెంబరు 6: ఎగువ నుంచి వచ్చి చేరే వరద తగ్గుతూ ఉండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి తగ్గుముఖం పడుతోంది. గురువారం రాత్రి పది గంటలు దాటిన తరువాత నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతోపాటు 10 లక్షల క్యూసెక్కులు పైబడి వరద ప్రవహిస్తూ ఉండడంతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఆపై క్రమంగా నీటిమట్టం పెరుగుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు 12.30 అడుగుల వరకు చేరుకుంది. ఈ సమయంలో బ్యారేజీ నుంచి 10,63,085 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. ఆపై అదే రీడింగ్ వద్ద నాలుగు గంటలపాటు నిలకడగా ఉన్న నీటిమట్టం మధ్యాహ్నం మూడు గంటల నుంచి నెమ్మదిగా తగ్గడం ప్రారంభించి సాయంత్రం ఆరు గంటలకు 12.10 అడుగులకు చేరి దిగువకు 10,36,440 క్యూసెక్కులు ప్రవహించింది. మళ్లీ రాత్రి 11 గంటలకు నీటిమట్టం 12 అడుగులకు చేరడంతో 10,21,195 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఇదే ఒరవడి కొనసాగి బ్యారేజీ నుంచి డిశ్చార్జి అవుతున్న వరద నీరు 10 లక్షల క్యూసెక్కులకంటే తగ్గితే మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరిస్తారు. కాగా ఎగువన భద్రాచలం వద్ద వరద నీటిమట్టం శుక్రవారం ఉదయం 11 గంటలకు 42.90 అడుగులకు చేరడంతో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. రాత్రి 11 గంటలకు 41 అడుగులకు చేరింది.

కొవ్వూరు గోదావరి తీరంలో..

కొవ్వూరు, సెప్టెంబరు 6: నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొవ్వూరు వద్ద అఖండ గౌతమీ గోదావరి ఇంకా ఉరకలు వేస్తూనే ఉంది. శుక్రవారం కూడా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలను పూర్తిగా వరద ముంచెత్తుతూ ప్రవహించింది. ఎగువ నుంచి అధికంగా వరద నీరు నదిలో చేరడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీ ప్రవాహంలో వడి ఎక్కువగా ఉందని, వినాయక చవితిని పురస్కరించుకుని నదీస్నానాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు ముందస్తు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. వరద ప్రవాహం ఉధృతంగా ఉన్నందున తీర ప్రాంత ప్రజలు పుణ్యస్నానాలకుగాని, చేపలవేటకుగాని దిగరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో నెమ్మదిగా ఇక్కడా తగ్గుముఖం పడుతోందని ఏజీఆర్‌బీ ఏఈ ఆర్.సునీల్‌బాబు తెలిపారు. కాగా అల్పపీడనం వల్ల మరో మూడ్రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తాజాగా హెచ్చరించింది.

మూడు నెలలకే హడావుడా..







జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ వేణుగోపాల్, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, కార్యక్రమంలో మాట్లాడుతున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

- వారంరోజులైనా సమయం ఇవ్వరా?
- గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95 వేల కోట్ల బిల్లులు బకాయిపెడితే అప్పుడు మాట్లాడలేదే
- వైసీపీపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం
- గౌరవ వేతనాల జాప్యంపై జడ్పీటీసీల అసంతృప్తి
- వాకౌట్ చేస్తామనడంతో సరికాదన్న కూటమి ఎమ్మెల్యేలు
- తుపానులు, వరదలపై చర్చించాలని హితవు
- కాకినాడలో వాడివేడిగా జడ్పీ సమావేశం

- 6లో



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు

రూరల్ గ్రామాల ముంపు సమస్యకు చెక్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 6: రూరల్ మండలం పరిధిలోని హుకుంపేట, బొమ్మూరు తదితర ప్రాంతాలకు వరద ముంపు సమస్య పరిష్కార దిశగా పనులు చేపట్టారు. రాజమహేంద్రవరం నగరంలోని కొన్ని ప్రాంతాలతోపాటు పిడింగొయ్యి, హుకుంపేట, బొమ్మూరు తదితర ప్రాంతాలకు సంబంధించి మురుగునీరు ఆవ కాలువ ద్వారా వెళుతూ ధవళేశ్వరం ప్రాంతంలోని సాయిబాబా గుడివద్ద గోదావరిలో కలుస్తోంది. అయితే ఆవ కాలువకు ఇరువైపులా పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతోపాటు గుర్రపు డెక్క తొలగించకపోవడంతో నీరు వెళ్లే మార్గంలేక బొమ్మూరు, హుకుంపేట, ధవళేశ్వరం తదితర గ్రామాలకు చెందిన కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు కూడా మునిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ముంపు ప్రాంతాలను క్షేత్రస్థాయి పరిశీలన చేసిన కలెక్టర్ పి.ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కాలువ సర్వే చేపట్టి ఆక్రమణలను తొలగించాలంటూ అధికారులను ఆదేశించారు. కాలువ ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహించుకుంటున్న నిర్వాహకులు ప్రముఖులు కావడంతో వారి జోలికి ఎవరూ పోలేదు. హుకుంపేట నుంచి ధవళేశ్వరం వరకు 37చోట్ల సుమారు 6 ఎకరాల మేర కాలువ ఆక్రమించి వ్యాపార సంస్థలు, ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచే రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహశీల్దార్ రమ్య, ఈవోపీఆర్డీ రాంబాబు, గ్రామ కార్యదర్శి వెంకట్రావు, మండల సర్వేయర్ శ్రీనివాసరెడ్డి, వీఆర్‌వోలు, సచివాలయ సర్వేయర్ల సాయంతో ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే బత్తుల రూ.25 లక్షల విరాళం

- 6లో

హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనంలో చిరుత సంచరించిందని పుకార్లు

- అప్రమత్తమైన అటవీ సిబ్బంది.. విస్తృత గాలింపు
- ఆర్ఎఫ్ఆర్‌సీలో అమర్చిన ట్రాప్ కెమెరాలు

- 6లో



ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి ఆలయం

విఘ్నాలను తొలగించే
సిద్ధి వినాయకుడు

● అయినవిల్లిలో వినాయక చవితి ఏర్పాట్లు పూర్తి

అయినవిల్లి, సెప్టెంబరు 6: అయినవిల్లిలో స్వయంభువై వెలిసిన వినాయకుడు సర్వ విఘ్నాలను తొలగించే స్వామిగా జగత్ ప్రసిద్ధినొందారు. ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా అయినవిల్లి సిద్ధి వినాయకుని దర్శించి పూజిస్తే ఆ కార్యం నిర్విఘ్నంగా పూర్తవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కోనసీమలోని మధ్యగౌతమీ, వృద్ధగౌతమీ గోదావరి పాయల సమీపంలో అయినవిల్లి సిద్ధివినాయకుడి ఆలయం ఉంది. అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో పూలు, పత్రాలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు.

చవితి రోజున ఉదయం 3.45 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. శైవాగమోక్త ప్రకారంగా అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం వినాయకచవితి సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో రుద్రాభిషేకం నిర్వహిస్తారు. లక్ష దూర్వార్చన, గణపతి కల్పం, శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

అయినవిల్లి క్షేత్రానికి వెళ్లాలంటే..

అయినవిల్లి వినాయకుడిని దర్శించుకోవాలని భక్తులు ఎంతో ఆతృత పడుతుంటారు. రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం మీదుగా 60 కిలోమీటర్లు ప్రయాణించి అయినవిల్లి క్షేత్రం చేరుకోవచ్చు. కాకినాడ నుంచి 55కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి వయా రాజోలు, అంబాజీపేట మీదుగా 61 కిలోమీటర్లు, అమలాపురం నుంచి వయా సిరిపల్లి మీదుగా 12 కిలోమీటర్లు పయనించి ఆ స్వామిని దర్శించుకోవచ్చు.



పుల్లా అబ్బులు-సత్యదేవానర్సరీలో తీర్చిదిద్దిన వృక్షగణపతి

అబ్బురపరుస్తున్న వృక్ష గణపతి

కడియం, సెప్టెంబరు 6: కడియపులంక సత్యదేవా నర్సరీలో వృక్షగణపతిని కూర్చారు.పుల్లా అబ్బులు, ఆయన కుమారులు వీరబాబు, రాజశేఖర్ పూలతో పర్యావరణ హితమైన వృక్ష గణపతి పేరిట వినాయక ఆకృతిని ఏర్పాటు చేశారు. కార్మికులతో మట్టి వినాయక బొమ్మలు తయారు చేయించి నర్సరీ రైతులకు అందజేశారు. పలువురు నర్సరీ రైతులు లయన్స్‌క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.



చవితి ఉత్సవాలకు
లక్ష్మీగణపతి ఆలయం ముస్తాబు

బిక్కవోలు, సెప్టెంబరు 6: బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో శనివారం నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం లైన్లు ఏర్పాటు చేశామన్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తామన్నారు. ఆలయ ప్రాంగణమంతా పందిరి డెకరేషన్, విద్యుత్ దీపాలంకరణ చేశామన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

లక్ష్మీగణపతి ఆలయంలో శనివారం నిర్వహించే చవితి ఉత్సవాలకు సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన లైన్లను శుక్రవారం సీఐ పరిశీలించారు. ఇద్దరు ఎస్ఐలతో పాటు 25 మంది పోలీసులను బందోబస్తుకు నియమించినట్లు చెప్పారు. వీరి వెంట టీడీపీ నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి రాజారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్, వెంకటరామయ్య తదితరులున్నారు.



బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో ఏర్పాటుచేసిన పందిరి డెకరేషన్

హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనంలో
చిరుత సంచరించిందని పుకార్లు

● అప్రమత్తమైన అటవీ సిబ్బంది
● అటవీ అధికారులు, ఉద్యోగుల విస్తృత గాలింపు
● ఆర్ఎఫ్ఆర్‌సీలో అమర్చిన ట్రాప్ కెమెరాలు



ఆర్ఎఫ్ఆర్‌సీలో అమర్చుతున్న ట్రాప్ కెమెరాలు, అనుమానాస్పదంగా ఉన్న పులి అడుగుజాడలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6: చిరుతపులి సంచరిస్తోందన్న వార్తలు నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనం మధ్య గురువారం అర్ధరాత్రి సమయంలో చిరుతపులి సంచరించిందన్న వార్తలు కలకలం రేపాయి. దీంతో అటవీ సిబ్బంది, స్థానిక రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఉద్యోగులు శుక్రవారం ఉదయం నుంచి గోదావరి మహాపుష్కరవనం, దాని సమీపంలోని అటవీ పరిశోధనా సంస్థ(ఆర్ఎఫ్ఆర్‌సీ) పరిసరాల్లో విస్తృతంగా గాలించారు. కొన్ని అనుమానాస్పద అడుగుజాడలు కనిపించాయని, అయితే ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా నేల బురదగా ఉండడంతో తమకు లభించిన అడుగు జాడలను వారు నిర్ధారించలేకపోయారు. కాగా అనుమానాస్పద అడుగుజాడలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పెగ్ మార్క్ చేసినట్టు దివాన్‌చెరువు సెక్షన్ డీఆర్వో పద్మావతి తెలిపారు. ఎనిమిది ట్రాప్ కెమెరాలను రప్పించామని, ఆర్ఎఫ్ఆర్‌సీ వద్ద అనుమానాస్పద పాదముద్ర లభించిన పరిసరాలలో వాటిని అమర్చుతున్నామన్నారు. దివాన్‌చెరువు, శ్రీరాంపురం, రూపానగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, ఆటోనగర్‌గ్రామాల ప్రజలు చిరుతపులి సంచరిస్తుందన్న ప్రచారంతో భయాందోళనలు చెందుతున్నారు.

ద్వారపూడి వెళుతున్న
హర్షకుమార్‌ను అడ్డుకున్న పోలీసులు

● జాతీయ రహదారిపై నిరసన.. నిలిచిన వాహనాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6: ద్వారపూడిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన సంఘటనపై బాధితులతో మాట్లాడేందుకు వెళుతున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కారును రాజమహేంద్రవరం జెస్ట్రైజ్ సెంటర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ ఆయన అక్కడే జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్బంధం లేకపోవడంతో ఆయన ద్వారపూడి నుంచి వచ్చిన కొంతమంది యువత కలిశారు. వారితో మాట్లాడిన సదరు యువతతో కలిసి కారులో ద్వారపూడి బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డగించడంతో హర్షకుమార్ జాతీయరహదారిపై ధర్నా చేశారు. దీంతో సుమారు 2కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు నేరుగా ఆయనను ఇంటికి తీసుకువెళ్లి మళ్లీ గృహనిర్బంధం చేశారు. హైవే సైడ్ అప్రోచ్ రోడ్డుగుండా వాహనాలను మళ్లించారు.



జాతీయ రహదారిపై హర్షకుమార్ కారును నిలుపుదల చేసిన పోలీసులు

వరద బాధితులకు ఎమ్మెల్యే బత్తుల రూ.25 లక్షల విరాళం



నగదు చెక్కును చూపిస్తున్న బత్తుల దంపతులు

రాజానగరం, సెప్టెంబరు 6: విజయవాడ పరిసర ప్రాంత వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ శుక్రవారం రూ.25లక్షలు విరాళంగా ప్రకటించారు. వరద బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాను అందించిన అనేక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. తన భార్య వెంకటలక్ష్మి, కుమార్తెలు, అల్లుడు నిర్ణయం మేరకు నియోజకవర్గం తరపున రూ.25 లక్షలు విరాళంగా అందజేశామన్నారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలనే సంకల్పంతో సీఎం సహాయ నిధికి అందించామన్నారు. వరద బాధితులకు ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎనలేని సేవలందించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజానగరం నియోజకవర్గంలోని దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితుల సహాయార్థం తమ విరాళాలను చెక్కు రూపంలోగానీ, డీడీ రూపంలో గానీ సీఎం సహాయనిధికి విరివిరిగా విరాళాలు అందజేయాలని కోరారు.

ఇద్దరు యువకులు ఆత్మహత్య



ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న యువకులు

తాళ్లరేవు, సెప్టెంబరు 6: కాకినాడజిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరం పంచాయతీ పరిధి అడివిపొలంలో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నట్లు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అడివిపొలం కోళ్ల పెంపక కేంద్రంలో పెదపూడి మండలం ఏపీత్రయంకు చెందిన పెసింగి విస్సాకు(21), గుర్రాని భవాని కిషోర్(22) ఇద్దరు స్నేహితులు. గురువారం రాత్రి జి.వేమవరం అడవిపొలం కోళ్లఫారంలోకి పనిచేసేందుకు వచ్చారు. అప్పులపాలై మద్యంమత్తులో వారు జీవితంమీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మృతదేహాలను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించి అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు విస్సాకు సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని వెళ్లి పరిశీలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

అనపర్తి, సెప్టెంబరు 6: అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన లంక నరేంద్ర(18) అనపర్తి రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నరేంద్ర అనపర్తిలోని తాతయ్య ఇంటివద్ద ఉంటూ స్థానికంగా దుకాణంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున కడుపునొప్పి వస్తుందని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి ట్రాక్‌పైకి దూకడంతో తల వెనుక బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే సూపరింటెండెంట్ సమాచారం మేరకు సామర్లకోట రైల్వే ఎస్ఐ బి.లోవరాజు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లోవరాజు తెలిపారు.

మూడు నెలలకే హడావుడా?

● వారంరోజులైనా సమయం ఇవ్వరా..?
● గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95వేలకోట్ల బిల్లులు బకాయిపెడితే అప్పుడు మాట్లాడలేదే
● వైసీపీపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం
● గౌరవ వేతనాల జాప్యంపై జడ్పీటీసీల అసంతృప్తి
● వాకౌట్ చేస్తామనడంతో సరికాదన్న కూటమి ఎమ్మెల్యేలు
● తుపానులు, వరదలపై చర్చించాల్సిన అవసరం ఉందని హితవు
● చర్చించిన అంశాల అమలుకు చర్యలు: జడ్పీ చైర్మన్
● కాకినాడలో వాడివేడిగా జడ్పీ సమావేశం
● కూటమి ప్రభుత్వం వచ్చాకే స్థానిక సంస్థలకు గౌరవం
● రూ.1452కోట్ల ఆర్థిక సంఘం నిధులు నేరుగా జమ
● హర్షం వ్యక్తం చేసిన కూటమి ఎమ్మెల్యేలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 6: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడిగావేడిగా సాగింది. ఏటా పంటలకు ఎదురవుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా సాగునీటి వ్యవస్థలపై ఆక్రమణలు తొలగించి ఆధునికీకరించే సమగ్ర కార్యాచరణ రూపకల్పనకు సమావేశం నిర్ణయించింది. జిల్లాలో రహదారులు అధ్వానంగా మారాయని, కనీసం రోడ్ల గోతులు పూడ్చే పనులలైనా తక్షణం చేపట్టాలని సభ్యులు నిలదీశారు. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో శుక్రవారం జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు.

జడ్పీటీసీల వేతనాలపై మాటామాటా..

జడ్పీ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు నేతృత్వంలో జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ 21నెలలుగా తమకు గౌరవ వేతనం చెల్లించలేదని, జనరల్ ఫండ్స్ నుంచి గౌరవ వేతనం చెల్లించేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ జడ్పీటీసీలకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా బాధపెట్టడం సరికాదని, తక్షణమే 50శాతం వేతనం అయినా చెల్లించాలని సూచించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ సభ్యుల వేతనాలు 50శాతంకాదని, పూర్తిగా చెల్లించాలని పట్టుబట్టారు. తాము వాకౌట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జడ్పీటీసీలు చెప్పగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ స్పందిస్తూ ఈ విషయమై వారంరోజుల్లో నిర్ణయం తీసుకుంటామని, వేతనాల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతానని తెలిపారు. అయినా జడ్పీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేయడంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలుగజేసుకుని ప్రభుత్వం ఏర్పడి మూడునెలలే అయ్యిందని, ముఖ్యమైన సమస్యలు చర్చించాల్సి ఉండగా వాకౌట్ చేస్తామనడం సరికాదని హితవు పలికారు. రానున్న రోజుల్లో అందరం కలిసి పనిచేద్దామన్నారు. స్థానిక సంస్థల సభ్యులకు తగిన గుర్తింపు గౌరవం లభించే రోజులు కానున్నాయన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కోనసీమలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

అప్పుడు మాట్లాడలేదే: అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95వేలకోట్ల బిల్లులు బకాయి పెడితే నోరు విప్పని ప్రజాప్రతినిధులు ఈ మూడు నెలలకే హడావిడి చేయడం సరికాదన్నారు. దీనివల్ల కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులను స్థానిక సంస్థలకు జగన్ ప్రభుత్వం జమచేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.1452కోట్లు నేరుగా స్థానిక సంస్థలకు జమచేసి వాటి గౌరవాన్ని కాపాడిందన్నారు. 21నెలలుగా చెల్లించని గౌరవవేతనం సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి వారంరోజులు సమయం ఇవ్వకుండా జడ్పీటీసీలు వాకౌట్ చేస్తామనడం సమంజసం కాదన్నారు. తుపానులు, వరదలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వాటి గురించి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.20కోట్లతో గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు ప్రారంభించిందన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల 34 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు కలెక్టర్లతో సమావేశం ఏర్పాటుచేసి డెల్టా ఆధునికీకరణకు నివేదికలు రూపొందించాలన్నారు.

కాలువలపై ఆక్రమణలు తొలగించాలి: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ ఇరిగేషన్ కాలువలపై ఆక్రమణలు తొలగించి వాటిని ఆధునికీకరించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. రమణయ్యపేట నుంచి గొడారిగుంట మీదుగా ఉప్పుటేరులో ముంపు నీరు కలిసే పళ్లంరాజు కెనాల్ మీద ఆక్రమణలు తొలగించాలన్నారు. రమణయ్యపేట పరిసర గ్రామాల్లో ఫ్యాక్టరీల కాలుష్యం, రసాయన వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, అక్కడ కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని కట్టించి అందుబాటులోకి తేవాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీలు

రోడ్ల పరిస్థితి దారుణం: జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జిల్లాలో రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. పూర్తి స్థాయిలో కాకపోయినా తక్షణం గోతులను అయినా పూడ్చించాలన్నారు. వాహనాలపై ప్రయాణించేవారు గోతుల్లో పడి ప్రమాదాలకు గురై మరణిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.1450 కోట్ల నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసి స్థానిక సంస్థల సభ్యుల గౌరవం పెంచిందన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: జడ్పీ చైర్మన్

జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, విస్తృతంగా చర్చించిన అంశాల అమలుకు చర్యలు తీసకుంటామని తెలిపారు. జిల్లాకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సభ్యుల గౌరవ వేతన విషయం ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. సమావేశంలో తూర్పుగోదావరి జేసీ ఎస్.చినరాముడు, వివిధ మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

● జరుగుతున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు

సామర్లకోట, సెప్టెంబరు 6: విజయవాడ ఎగువ ప్రాంతా లలో రైల్వేట్రాక్ భారీ వరదల కారణంగా దెబ్బతినడంతో సామర్లకోట మీదుగా అటు విశాఖ, ఇటు విజయవాడలకు పలు రైళ్ల రాకపోకలను రద్దుచేసిన కొన్ని రైళ్లను తిరిగి పునరుద్ధరించారు. ఇంకా మరి కొన్ని రైళ్లను రద్దు జాబితాలో ఇంకా కొన సాగిస్తూ రైల్వే ఉన్నతాధికారులు రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నెం. 12737 గల కాకినాడ-లింగంపల్లి మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ ముందుగా నిర్దేశించన సమయం శుక్రవారంరాత్రి 7.10కు కాకుండా అర్ధరాత్రి 12.30కు రీషెడ్యూల్ చేసి కాకినాడ నుంచి బయలుదేరుతుందని సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ శుక్రవారంరాత్రి చెప్పారు. ఈమేరకు డిప్యూటీ సీహెచ్ఎం కె.మణికుమార్ (సికింద్రాబాద్) నుంచి ఉత్తర్వులు అందాయి. ఈనెల 7,8,9 తేదీల వరకూ రద్దు చేసిన రైళ్ల వివరాలను ఈవిధంగా ఉన్నాయి. విజయవాడ-రాజమండ్రి మధ్య నడిచే(07459) రైలు, భీమవరం-నిడదవోలు మధ్య నడిచే (07885) రైలు, రాజమండ్రి- విజయవాడ మధ్య నడిచే (07460) రైలు, భీమవరం-నిడద వోలు మధ్య నడిచే (07885) రైలు, నిడదవోలు-భీమవరం మధ్య నడిచే (07886) రైలు, నరసాపురం-నిడదవోలు- నరసాపురం మధ్య నడిచే రైలు (07673,07674), భీమవరం-నిడదవో లు-భీమవరం మధ్య నడిచే రైళ్ల (07772, 07882), విజయ వాడ-రాజమండ్రి- విజయవాడ మధ్య నడిచే రైళ్ల (07768, 07767) ఈనెల 7,8 తేదీలలో రద్దు చేశారు. కాకినాడ-విజయ వాడ మధ్య నడిచే రైలు (17258) ఈనెల 7,8,9 తేదీలలో రద్దు చేశారు. గురువారం విశాఖ- గుంటూరుల మధ్య సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 9వరకూ రద్దయ్యాయి. కాకినాడ-లింగం పల్లి- కాకినాడ మధ్య నడిచే (12737, 12738, 12775) రైలు, నాందేడ్-విశాఖ మధ్య నడిచే (20812) రైలు, విశాఖ-మహ బూబ్‌నగర్-విశాఖ మధ్య నడిచే (12861, 12862) రైళ్లు ఈనెల 5 నుంచి విజయవాడ సమీపాన రాయనపాడు స్టేషన్లో హాల్ట్ పాక్షికంగా ఎత్తివేశారు. ఈమేరకు రైల్వే ఎస్టీఎం చార్జ్ అధికారి రాజనరసు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పూలు కోయడానికి మడుగులోకి దిగి వ్యక్తి మృతి

కరప, సెప్టెంబరు 6: కలువ పూలు కోయడానికని మడుగులోకి దిగిన ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ అందులో మునిగి చనిపోయినట్టుగా కరప పోలీసులు తెలిపారు. కాకినాడజిల్లా కరప మండలం కూరాడ శివారు చినమామిడాడ గ్రామానికి చెందిన బత్తుల శివ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వినాయక చవితి పర్వదినానికి కలువ పూలు విక్రయిద్దామని భావించిన శివ బుధవారం స్థానికంగా ఉన్న ఒక మడుగులోకి దిగాడు. పూలు కోస్తుండగా శివకు ఫిట్స్ వచ్చి మడుగులో బోర్లా పడ్డాడు. ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో మడుగులో మునిగి చనిపోయాడు. శుక్రవారం ఉదయం మడుగుపై తేలిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వీఆర్వో దేవగుప్తాపు ప్రసన్న ద్వారా కరప పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టమ్ నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి

● మృతులు పల్నాడు జిల్లా సీవల్లిపురం, శ్రీకాకుళం జిల్లా పలాసవాసులు ● శోకసంద్రంలో తోటి విద్యార్థులు



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రివద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల భౌతికకాయాల వద్ద విలపిస్తున్న బంధువులు, విద్యార్థులు

రోణంకి ప్రవీణ్ కుమార్ (ఫైల్) | చింతా కార్తీక్ (ఫైల్)

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6: తూర్పుగోదావరిజిల్లా జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో పల్నాడు జిల్లా సీవల్లిపురం గ్రామానికి చెందిన చింతా కార్తీక్(19), శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రోణంకి ప్రవీణ్(21) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరిద్దరూ ఇక్కడ సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి బొమ్మూరు ఎస్ఐ అంకారావు శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. వీరు బ్రిడ్జి కౌంటీలోని ఒక రూమ్‌లో ఉంటున్నారు. ప్రవీణ్‌కు ఒంట్లో బాగోకపోవడంతో ఇద్దరు గురువారంరాత్రి స్కూటీపై ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా వీరిని ఢీకొని కొద్దిదూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఇద్దరి శరీరభాగాలు తెగి రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ఆప్రాంతమంతా రక్తసిక్తమైంది. సమాచారం అందుకున్న వెంటనే బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకోగా డ్రైవరు పరారీలో ఉన్నాడన్నారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అంకారావు తెలిపారు.

సహచర విద్యార్థుల దిగ్ర్భాంతి

శవపరీక్ష అనంతరం విద్యార్థుల భౌతికకాయాలు తీసుకువెళ్తున్న అంబులెన్స్‌లను వారు చదువుతున్న కళాశాల ప్రధానద్వారం వద్దకు తీసుకు వచ్చి కొద్దిసేపు ఉంచారు. నిన్నటి వరకూ తమతో కలసి ఉన్న విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో సహచర విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.



ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు



బోరున విలపిస్తున్న కార్తీక్ తండ్రి వీరాంజనేయులు

ఒక్క కొడుకూ దూరమయ్యాడు...

● మృతుడు కార్తీక్ తండ్రి వీరాంజనేయులు కన్నీటి పర్యంతం

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు 6: ఎన్నో ఆశలతో ఇంజనీరింగ్ చదివిస్తున్న తన ఒక్కగానొక్క కొడుకు దూరమయ్యాడని దివాన్‌చెరువు వద్ద లారీ ఢీ కొన్న దుర్ఘటనలో మృతి చెందిన చింత కార్తీక్ తండ్రి వీరాంజనేయులు రోధించడం అక్కడున్న వారిని కలచివేసింది. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఇంజనీరింగ్ విద్యార్థులు చింత కార్తీక్, రోణంకి ప్రవీణ్ మృతదేహాలకు శుక్రవారం రాజమహేంద్రవరంలోని జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. కాగా, వీరాంజనేయులు వ్యవసాయం చేస్తుంటారు. ప్రమాదం వార్త తెలియగానే పలాస నుంచి ప్రవీణ్ కుటుంబ సభ్యులు, వినుకొండ నుంచి కార్తీక్ కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజమహేంద్రవరం చేరుకున్నారు. కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆసుపత్రి మార్చురీ వద్దకు గైట్ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొందరు విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఏజెన్సీ సమాచారం

పరిహారం అందేలా కృషిచేస్తా: ఎమ్మెల్యే శిరీషదేవి

కూనవరం, సెప్టెంబర్ 6: పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురయ్యే ప్రతీ గ్రామానికి కూటమి ప్రభుత్వ హయాంలోనే పరిహారం అందేలా కృషిచేస్తానని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి అన్నారు. గోదావరి వరదకు ముంపునకు గురైన గిన్నెలబజారు బాధితులతో ఆమె మాట్లాడారు. రంపచోడవరం తెలుగుయువత అధ్యక్షుడు మఠం భాస్కర్, కూనవరం మండల అధ్యక్షుడు బరపాటి ప్రకాశ్, ఉమామహేశ్వరరావు, నోముల సత్యనారాయణ, గడ్డిపాటి ప్రసాద్, రంజిత్ పాల్గొన్నారు.

గ్రామానికి చేరిన రాము మృతదేహం



ఎటపాక, సెప్టెంబరు6: తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం మోతే సమీపంలోని దోనాలగుంట అడవిలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలో అల్లూరి జిల్లా ఎటపాక మండలం సంగ్గంపాడుకు వలస ఆదివాసీ గ్రామానికి చెందిన, ప్రస్తుతం తెలంగాణలోని పాల్వంచ, మణుగూరు ఏరియా కమాండర్‌గా పనిచేస్తున్న కొర్సా రాము (25) మృతదేహం శుక్రవారం స్వ గ్రామానికి చేరుకుంది. కొర్సా రాము 2015లో మావోయిస్టు దళంలో చేరాడు. అనంతరం దళంలో ఎదుగుతూ ప్రస్తుతం రాము మణుగూరు, పాల్వంచ ఏరియా కమాండర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్ మృతి చెందాడు. ఎన్‌కౌంటర్ అనంతరం మావో యిస్టులు విడుదల చేసిన మృతుల వివరాల్లో ఇంటి పేర్లతో తప్పులు ఉండడంతో కొర్సా రాము మృతదేహంను కుటుంబ సభ్యులకు అప్పగించడంలో కాస్త ఆలస్యమైంది. దాంతో పోలీసులు గ్రామంలోకి వెళ్లి లోతుగా విచారణ చేపట్టి మృతుడి వివరాలను కనుగొన్నారు దాంతో పోలీసులు కొర్సా రాముగా నిర్ధారించి, మణుగూరు ఏరియా వైద్యశాలలో రాము మృతదేహంను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొర్సా రాముపై రూ. 4లక్షల రివార్డు కూడా ఉంది.

వరద ప్రాంతాలలో కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 6: మండలంలో గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, చింతూరు సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఎమ్మెల్యే శిరీషాదేవి వరద ముంపు గ్రామాలలో శుక్రవారం పర్యటించారు. ముందుగా శ్రీరామగిరి గ్రామంలోని వరద బాధితులతో కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ గోదావరి వరద తగ్గుతుందని ఎవరూ భయాందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. ఈక్రమంలో ప్రభుత్వం నుంచి వరద బాధితులకు కందిపప్పు, మంచినూనె ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం చింతరేవుపల్లి గ్రామానికి కలెక్టర్లు వెళ్లి వరద బాధితులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్. సుబ్బారావు, ఎంపీడీవో ఫణీంద్ర, సీఐ కన్నంరాజు, ఎస్ఐ సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యులు వాళ్ళ రంగారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆచంటి శ్రీను, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అటవీశాఖలో సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

రంపచోడవరం, సెప్టెంబరు 6:డివిజన్ పరిధిలోని అటవీశాఖలో పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బంది (డ్రైవర్లు, డీఈవోలు, బేస్ క్యాంపు, చెక్ పోస్టు హెల్పర్లు) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం డివిజనల్ అటవీశాఖాధికారికి వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 9వ తేదీ నుంచి శాంతియుత పోరాటం చేస్తామని తెలిపారు. డీఎఫ్‌వోను కలిసిన వారిలో బి.గోవిందరావు, కుంచె విజయశంకర్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూడు పశువులు మృతి

ఎటపాక, సెప్టెంబరు: విద్యుదాఘాతంతో మూడు పశువులు మృతి చెందాయి. ఈ ఘటన శుక్రవారం లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని కంగాల గంగయ్యకు చెందిన ఒక ఆవు, రెండు ఎద్దులు సమీపంలోని జామాయిల్ తోటలోకి మేతకు వెళ్లాయి. త్రీపేస్ లైన్ విద్యుత్ వైర్ తెగిపడి ఉండడంతో, దానిని తాకిన పశువులు వెంటనే మృత్యువాత పడ్డాయి. ఆస్తి విలువ రూ.70వేల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు.

10న కొవ్వూరులో జాబ్‌మేళా

కొవ్వూరు, సెప్టెంబరు 6: కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఈ మేళాలో టీవీఎస్, ఎంజీ మోటార్స్ హెటిరో ల్యాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీతోపాటు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎంసీఏ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. 10వ తేదీ ఉదయం 9గంటలకు కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 73062 32373(ఎం.కొండలరావు) నెంబరును సంప్రదించాలన్నారు.

మట్టి గణనాథులనే పూజించండి



అనపర్తిలో మట్టి ప్రతిమలు పంపిణీని చేస్తున్న సుధాకరరెడ్డి

» టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుధాకరరెడ్డి
» పలుచోట్ల వినాయకుడి మట్టి ప్రతిమల అందజేత

అనపర్తి, సెప్టెంబరు 6: ప్రతిఒక్కరూ మట్టితో చేసిన గణనాథులనే పూజించి తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి పంచాయతీ కార్యాలయ ప్రాంగణలో జనసేన, కర్రి బులిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 1500 విగ్రహాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు ఎస్ఆర్‌కే ప్రసాదరెడ్డి, జనసైనికులు పాల్గొన్నారు.

సీతానగరం: వినాయక చవితికి పర్యావరణ హిత మట్టి వినాయకులను పూజిద్దామంటూ మండలంలోని బొబ్బిల్లంక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే పద్ధతులను విడనాడి పర్యావరణ హిత మట్టి వినాయకుని పూజించాలని ప్రజలకు అవగాహన కలిగించారు.

రంగంపేట: మండలంలోని చంద్రేడు జడ్పీ హైస్కూల్లో 7, 9వ తరగతి విద్యార్థినులు గుర్రం శిరీష, గుర్రం విజయలక్ష్మి మట్టి గణపతి విగ్రహాలు తయారు చేసి ప్రధానోపాధ్యాయుడు గంట రమణబాబుకు అందించారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 42వ డివిజన్‌లో శ్రీ సంకట హరవర సిద్ధి వినాయక ఆలయం వద్ద స్వాతి ప్రమోటర్స్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల పంపిణీ జరిగింది. దీనికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రతిమలను పలువురికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురథా, టీడీపీ నాయకులు మళ్ల వెంకట్రాజు, సంసాని ప్రసాద్, వానపల్లి శ్రీనివాసరావు, స్వాతి ప్రతినిధులు ఆశీర్వాదాం, లక్ష్మణరావు, సత్తిబాబు, అబ్రహాం లింకన్ పాల్గొన్నారు.

కడియం: వేమగిరి శ్రీకృష్ణ చైతన్య స్కూల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చిన్నారులు వినాయకుడు, శివుడు, పార్వతీదేవి వేషధారణలతో అలరించారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా దర్శనాలు కల్పించాలి

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, సెప్టెంబరు 6: వినాయకచవితి సందర్భంగా లక్ష్మీగణపతిని దర్శించుకోడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి దర్శనాలు కల్పించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులను, ఉత్సవ కమిటీని కోరారు. శుక్రవారం రాత్రి ఆయన బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహించే చవితి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఆయన స్వామిని దర్శించారు. జిల్లాలోనే పేరుగాంచిన లక్ష్మీగణపతిని దర్శించుకోడానికి వేల సంఖ్యలో భక్తులు వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈయన వెంట ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, కూటమి నాయకులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, ఇందల వీరబాబు, సింగారపు రామారావు, గుణ్ణం రమేష్ చౌదరి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.



సీతానగరం: వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న బొబ్బిల్లంక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ఆకాశాన్నంటిన పూజా సామగ్రి ధరలు

వెలవెలబోయిన దుకాణాలు



అనపర్తి మెయిన్ రోడ్డులో చవితి సామగ్రి దుకాణాలు

అనపర్తి, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా అనపర్తి మెయిన్‌రోడ్డుపై శుక్రవారం పూజా సామగ్రి దుకాణాలు వెలిశాయి. చిరువ్యాపారులు దేవీచౌక్ నుంచి రైల్వేస్టేషన్ వరకు అనేక రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే సామగ్రితోపాటు పూలు, పండ్ల ధరలు అధికంగా ఉండడంతో భక్తులు కొద్దిపాటి కొనుగోళ్లతోనే సరిపెట్టుకుంటున్నారు. దీంతో దుకాణాలన్నీ వెలవెలబోతున్నాయి. వ్యాపారులు బేరాలు లేక ఉసూరు మంటున్నారు. ఎన్నో ప్రయాశలకు ఓర్చి తెచ్చిన మారేడు, సీతాఫలాలు, వెలగకాయలను రైతులు గుట్టలుగా పోసి వినియోగదారుల కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది.

బాధితులకు చేయూత

» విజయవాడ ముంపు ప్రాంతాలకు ఆహార పొట్లాల తరలింపు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6: విజయవాడ వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు 15వేల ఆహార పొట్లాలను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ తరలించింది. శుక్రవారం తెల్లవారుజామున 3గంటలకు ఆహార పొట్లాల వాహనాన్ని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సత్యవేణి పంపించారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 15వేల ఫుడ్ ప్యాకెట్లను పంపించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఆర్వోలు సీహెచ్ శ్రీనివాసరావు, కేబీఆర్ రవికుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: విజయవాడ వరద బాధితులకు సాయంగా దిజాంపేట దేవాంగ సంక్షేమ సంఘం రూ.34,505లను సీఎం రిలీఫ్ ఫండ్‌కు శుక్రవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సమక్షంలో అందజేసింది. బాధితులకు సహాయం చేస్తున్న చిన్న సంఘాలను ప్రశంసించారు. ప్రతీ సంఘం స్పందించి ముంపు ప్రజానీకానికి సహాయపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు రొబ్బి విజయశేఖర్, పింజర్ల సూర్యప్రకాశరావు, నల్లా శంకరరావు, కొమ్మన వీర్రాజు, పూర్ణిమ ప్రసాద్, గంపా గిరి, ఉప్పు సోమశేఖర్, బీరా రాజు, కొడమటి జగన్మోహనరావు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు 9 వేల ఆహార పొట్లాలను, బీజేపీ నాయకులు 5 వేల బిస్కెట్లు ప్యాకెట్లు, జనసేన నాయకులు 5వేల వాటర్ బాటిల్స్‌ను సమకూర్చారు. వాటన్నింటిని విజయవాడ తీసుకెళుతున్న వాహనాలను నల్లమిల్లి మనోజ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, యలమాటి రాంబాబు, గారపాటి రాంబాబు, పోతుల వెంకట్రావు, ఉండవిల్లి గిరిబాబు, ఉద్దండ్రావు శ్రీను, మండవిల్లి గుప్త తదితరులు పాల్గొన్నారు.



రంగంపేట: ఆహార పొట్లాలతో విజయవాడ వెళ్తున్న వ్యాన్‌కు జెండా ఊపుతున్న మనోజ్‌రెడ్డి



రాజమహేంద్రవరం నుంచి వెళ్తున్న లారీని ప్రారంభిస్తున్న అడిషినల్ కమిషనర్

రాజమహేంద్రవరం అర్బన్: విజయవాడ వరద బాధితుల కోసం రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆర్థిక సహాయంతో వెయ్యి కుటుంబాలకు సుమారు రూ.2 వేల విలువ చేసే నిత్యావసర కిట్లను శుక్రవారం పంపించారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం నుంచి విజయవాడ బయలుదేరిన వాహనాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్ఎంసీ కార్మికుల సేవలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతంలో పారిశుధ్య పనులు చేసేందుకు రాజమహేంద్రవరం కార్పొరేషన్ నుంచి 300 మంది పారిశుధ్య కార్మికులను తరలించిన సంగతి తెలిసిందే. శుక్రవారం విజయవాడలో ఆర్ఎంసీ పారిశుధ్య కార్మికులు సేవలందించారు. వీరు బుడమేరు కాలువ వరద ప్రభావిత ప్రాంతంలో నాలుగురోజులుగా సేవలందిస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో విజయవాడ వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, డ్రైనేజీల్లో సిల్ట్‌ను తీసివేయడం వంటి పనులు చేస్తున్నారు.

సీపీఐ విరాళాల సేకరణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టినట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ శ్రేణులంతా పలు ప్రాంతాల్లో బియ్యం, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు తదితరాలను విరాళాలుగా సేకరించాయని తెలిపారు. ఎవరైనా దాతలు దుస్తులు, వస్తుసామగ్రి వంటివి ఇవ్వాలనుకుంటే రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో అందజేయాలని కోరారు. సేకరించిన విరాళాలు, ఇతర వస్తువులతో ఈనెల 8న విజయవాడకు వ్యాన్ బయలుదేరుతుందని ఆయన చెప్పారు.

కాపవరం మత్స్యకార సొసైటీలో అవకతవకలు

పాత పాలక వర్గం రద్దు.. ప్రత్యేకాధికారి నియామకం

కోరుకొండ, సెప్టెంబరు 6: మండలంలోని కాపవరం మత్స్య కార సొసైటీలో పలు అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయని, గత పాలకవర్గం రికార్డులు తమకు స్వాధీనం చేయాలని తెలియజేసినప్పటికీ ఇంతవరకు వారు అందజేయలేదని ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సొసైటీ ప్రత్యేకాధికారి ఎం.బ్రహ్మానందం పేర్కొన్నారు. దీంతో మత్స్యశాఖ ఉన్నతాధికారులు కాపవరం మత్స్యకార సొసైటీ పాత పాలకవర్గాన్ని రద్దు చేశారని, ప్రత్యేకాధికారిగా తనను నియమించారని ఆయన అన్నారు. ఈ మేరకు సొసైటీ సభ్యులతో సమావేశమై సొసైటీ లావాదేవీలపై సభ్యులతో సమీక్ష నిర్వహించామన్నారు. త్వరలోనే కాపవరం మత్స్యకార సొసైటీకి ఎన్నికలు జరుగుతాయన్నారు.

ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలి

జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల ఆందోళన



రాజమహేంద్రవరం జీజీహెచ్ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఆందోళనకు చేశారు. ఈ మేరకు శుక్రవారం జీజీహెచ్ ఎదుట కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు కొంతసేపు నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏఎన్ఎం నుంచి స్టాఫ్ నర్సులుగా శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, తమను పట్టించుకోవడంలేదని అన్నారు. చాలా ఏళ్ల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను కూడా రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలని వారు కోరారు.

బీజేపీ నాయకుడి మృతికి ఎంపీ సంతాపం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6: బీజేపీ నాయకుడు రాయుడు వెంకటేశ్వరరావు మృతి పట్ల రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర సంతాపం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బీజేపీ ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోయిందని ఆమె పేర్కొన్నారు.

కేన్సర్ బాధితురాలికి 'గాయత్రి' ఆర్థిక సాయం

రాజానగరం, సెప్టెంబరు 6: బోన్ కేన్సర్‌తో బాధపడుతున్న మండలంలోని కానవరం గ్రామానికి చెందిన శివ నాగదుర్గకు స్థానిక గాయత్రి విద్యా సంస్థల తరపున రూ.70 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మూర్తి మాట్లాడుతూ టీచర్స్ డే సందర్భంగా కానవరం, కోరుకొండలోని తమ బ్రాంచ్‌లలో అధ్యాపకులు, విద్యార్థులు సమకూర్చిన మొత్తాన్ని బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి బంగారం, అధ్యాపకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు వాసవీ క్లబ్ సత్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 6: వాసవీ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కోటిపల్లి బస్టాండ్ దగ్గర్లోని స్వాతంత్ర్య సమర యోధుల పార్కులో జర్నలిస్ట్ డే నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్, మల్టిపుల్ వైస్ ప్రెసిడెంట్ శఖాకొల్లి కరుణకుమార్, సీహెచ్‌వీఎన్‌సీ గుప్తా, బీవీఎస్ నారాయణ మూర్తి, ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ రాయపూడి నాగసాయిలక్ష్మి, రాయపూడి వెంకటేశ్వరరావు, శఖాకొల్లి శైలజ సారధ్యంలో సీనియర్ జర్నలిస్టులు చల్లా సూర్యనారాయణ, మాదిరాజు శ్రీనివాస్, భమిడిపల్లి వీర రాఘవరావు, దేశరాజు తలుపులరావు, సూరంపూడి సోమరాజు, కెమేరామెన్ వీరబాబులను సత్కరించారు.

లక్ష్యం దిశగా పయనించాలి

రాజానగరం, సెప్టెంబరు 6: యువ ఇంజనీర్లు లక్ష్య సాధన దిశగా పయనించాలని సీనియర్ కన్సల్టెంట్ హెచ్ఆర్ ఇన్ మైండ్ మేనేజ్‌మెంట్ వి.రవికుమార్ ఆకాంక్షించారు. జీజీయూలో యువ ఇంజనీర్లకు లివింగ్ సక్సెస్‌ఫుల్లీ విత్ స్క్వాడ్ ఆఫ్ పీపుల్ అనే అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మానసిక ఒత్తిడిని అధిగమిస్తూ నైపుణ్యాలను బలపర్చుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. ప్రపంచ దేశాల్లో భారతీయ విద్యార్థులు పనిచేసినంతగా మిగిలిన వారెవరూ కష్టపడలేరని చెప్పారు. కార్యక్రమంలో జీజీయూ పరిశోధన అభివృద్ధి అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్ రాజు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుడికి గాయాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రన్నింగ్‌లో ఉన్న రైలు దిగుతూ ఓ ప్రయాణికుడు ప్రమాదం బారిన పడ్డాడు. అయినవిల్లికి చెందిన విల్లా వినయ్‌కృష్ణ గోదావరి రైలులో రాజమండ్రి వచ్చాడు. రైలు 3వ ప్లాట్‌ఫాంకు ప్రవేశిస్తుండగా క్రూ లాబీ వద్ద దిగడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో జారి పడిపోవడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించామని జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు తెలిపారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

బిక్కవోలు, సెప్టెంబరు 6: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. స్థానిక ప్రజ్ఞా కళాశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతోపాటు జిల్లా ఉత్తమోపాధ్యాయ అవార్డు గ్రహీత విజయకుమారి దంపతులు తదితరులను కళాశాల యాజమాన్యం సత్కరించింది.

ఉధృతంగా కొండవాగులు

● గిరిజన గ్రామాల రాకపోకలకు అంతరాయం

మారేడుమిల్లి, సెప్టెంబరు 6: గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాలకు ఏజెన్సీలోని కొండవాగుల పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గిరిజన గ్రామాలకు రాకపోకల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని బొడ్లంక సమీపంలోని పెళ్లిరేవు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఏజెన్సీ ఎగువప్రాంతం, వై.రామవరం మండలంలోని పలు పంచాయితీలలోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నిత్యావసర సరుకుల కోసం వారపు సంత లకు వచ్చే గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుర్తేడు, పాతకోట పంచాయితీలకు వెళ్లే ఆర్టీసీ బస్ సర్వీసును ఆకుమామిడి కోట వరకు పరిమితం చేశారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండ డంతో పోలీస్ అధికారులు తగు చర్యలు చేపట్టి వాగులవద్ద పోలీస్ పహారా ఏర్పాటు చేసి గిరిజనులు వాగు దాటకుండా తగు చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 7 సెప్టెంబరు 2024 | 5



ఉత్సవానికి సిద్ధమైన భారీ మట్టి విగ్రహం



రాజమహేంద్రవరంలో శ్యామలా థియేటర్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను విక్రయిస్తున్న దృశ్యం

జై జై గణేశా..

జిల్లా అంతటా వినాయక చవితి సందడి నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచే పూలు, పండ్లు, పత్రి, ప్రతిమల కోసం జనం మార్కెట్లలో క్యూకట్టారు. రాజమహేంద్రవరంతో పాటు అన్నిచోట్లా వ్యాపార కూడళ్లన్నీ కళకళలాడాయి. అదేవిధంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల కోసం ఉత్సవ పందిళ్లన్నీ సిద్ధమయ్యాయి. ఆయాచోట్ల భారీ విగ్రహాలను నెలకొల్పేందుకు ఉత్సవ కమిటీలు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నాయి. దీంతో శుక్రవారమే విగ్రహాల తయారీ ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో యువకులు ఆయా విగ్రహాలను తరలించుకు వెళ్లారు. ఇక పూజ కోసం వినియోగించే పూలకు భారీ డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో ప్రధానమైన కడియం పూల మార్కెట్‌తోపాటు పెరవలి మండలం కాకరపర్రు మార్కెట్‌లోనూ పూల ధరలు ఆకాశాన్నంటాయి.



రాజమహేంద్రవరంలో కంబాల చెరువు వద్ద చవితి మార్కెట్‌లో సందడి

- జిల్లా అంతటా వినాయక చవితి సందడి
- ఉత్సవ పందిళ్లలో నెలకొన్న పండుగ వాతావరణం
- ఇప్పటికే భారీ విగ్రహాలు తరలింపు
- మట్టి విగ్రహాలకు కొద్దిగా పెరిగిన ప్రాధాన్యం
- పూలు, పండ్లు, పత్రి, ప్రతిమల కోసం మార్కెట్లు జనంతో రద్దీ



రాజమహేంద్రవరంలో ఉత్సవాలకు తరలిస్తున్న విగ్రహం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా జిల్లా అంతటా పండుగ సందడి నెలకొంది. మార్కెట్లన్నీ కళకళలాడాయి. రాజమహేంద్రవరంలో వస్త్ర, బంగారం వ్యాపారాలు జోరుగా సాగాయి. ఇక మార్కెట్‌లో పూజా సామగ్రి కోసం జనం క్యూకట్టారు. నగరంలో ప్రధాన కూడళ్లలో పూలు, పండ్లు, పత్రి, ప్రతిమల విక్రయాలు పెద్దఎత్తున సాగాయి. ఈసారి వినాయకుడి చిన్న ప్రతిమల నుంచి పెద్ద విగ్రహాల వరకు మట్టితో చేసిన వాటికే ఎక్కువగా జనం, ఉత్సవ కమిటీలు ప్రాధాన్యం ఇచ్చాయి. అలాగే వివిధ రూపాల్లో ఉన్న గణేశుడి విగ్రహాలను ఏర్పాటుచేసేందుకు యువకులు ఉత్సాహంగా వాటిని కొనుగోలు చేశారు. పలుచోట్ల పర్యావరణహితాన్ని కాంక్షిస్తూ వ్యక్తులు, సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. నగరంలోని శ్యామలానగర్, పాతకూరగాయల మార్కెట్, డీలక్స్ సెంటర్, జాంపేట పూలమార్కెట్, కంబాలచెరువు సెంటర్, దేవీచౌక్ సెంటర్, జాంపేట గాంధీ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాలన్నీ చవితి పూజా సామగ్రి విక్రయాలు సాగుతుండడంతో సాయంత్రం ఆయా ప్రాంతాలు జనంతో నిండిపోయాయి. ఇక గణేష్‌చౌక్, నాళం భీమరాజు వీధి, లలితానగర్, తాలూకా ఆఫీసు,శ్యామలానగర్ వంటిచోట్ల ఉన్న వినాయక ఆలయాలతోపాటు, పుష్కర్ ఘాట్ తదితర చోట్ల గణపతి నవరాత్రి వేడుకల కోసం వివిధ రూపాల్లో, అనేక రంగుల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటుచేశారు. ప్రతిరోజూ గణపతి పూజలతోపాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి.

పూలమార్కెట్‌కు చవితి కళ





కడియపులంక అంతర్‌రాష్ట్ర పూలమార్కెట్

కడియం, సెప్టెంబరు 6: కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌కు చవితికళ ఏర్పడింది. కొనుగోలుదారులు, వ్యాపారులు, రైతులతో మార్కెట్‌కు కళకళలాడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ పూలమార్కెట్ పండుగ సందర్భాల్లో మరింత బిజీగా మారడం సహజమే. మల్లెలు, కాగడాలు, జాజులు, లిల్లీ పూలు ఈ ప్రాంతంలో లభిస్తుంటే, చామంతి, బంతి, పూలను తమిళనాడు, కర్నాటక, కలకత్తా ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం చవితి డిమాండ్‌తో మార్కెట్‌లో ధరలు పెరిగాయి.

మల్లెలు (కిలో) రూ. 1,500
కాగడాలు (కిలో) రూ. 1,000
జాజులు (కిలో) రూ. 1,400
లిల్లీ (కిలో) రూ. 220
తమిళనాడు చామంతి (కిలో) రూ. 300
నీలం చామంతి (కిలో) రూ. 300
వైట్ చామంతి (కిలో) రూ. 350
కర్నాటక బంతి (కిలో) రూ. 70-100
కలకత్తా బంతి (కిలో) రూ. 100
కనకంబరం (బారు-1) రూ. 400
డచ్ (20పూలు) రూ. 350
స్టార్‌గులాబీ (కిలో) రూ. 300
సెంట్ గులాబీ(కిలో) రూ. 220

కాకరపర్రు పూల మార్కెట్‌లో..

పెరవలి, సెప్టెంబరు6: చవితి సందర్భంగా పూల ధరలు ఆకాశాన్నాంటాయి. కాకరపర్రు పూల మార్కెట్‌లో వివిధ రకాల పూలు ఎక్కువ రేటు పలికాయి. ఈ ప్రాంతంలో పండిన పువ్వులతోపాటు బెంగుళూరు, కడియం నుంచి వివిధ రకాల పువ్వులను దిగుమతి చేసినట్టు వ్యాపారులు పేర్కొన్నారు. కాకరపర్రు పూల మార్కెట్‌లో పూల ధరలు చూస్తే తెల్ల చామంతి కిలో రూ.400, పసుపు, ఎరుపు బంతి రూ.100, గులాబీలు రూ.250, చామంతి రూ.400, కనకాంబరం రూ.2200, జాజులు రూ.1700 ధర పలికాయి.



ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 6: జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలను కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణపతి ఉత్సవాలు చేసేవారు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతుగా భాగస్వాములు కావాలన్నారు. చవితి పండుగ జరుపు విధానంలో ప్రకృతిలో సహజంగా లభించే వాటితోనే చేయడం పురాతనకాలం నుంచి ఆచారంగా వస్తోందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తదితర నీటిలో కరగని వాటిని ఉపయోగించి తయారుచేసిన విగ్రహాలను పూజలో వినియోగించవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం సూచనలు పాటించాలని కోరారు. ప్రజలు సంతోషంగా వినాయక చవితి పండుగ జరపాలని ఆకాంక్షించారు.

పర్యావరణ హితం మట్టి వినాయకుడు

జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోరి జిల్లా ప్రజలు మట్టి వినాయక ప్రతిమలతో మాత్రమే చవితి పండుగ జరుపుకోవాలని ఎస్పీ నరసింహకిషోర్ పిలుపునిచ్చారు. వివిధ రసాయనాలతో చేసిన ప్రతిమల వల్ల నదులు కలుషితం కావడంతోపాటు పర్యావరణానికి చేటు జరుగుతోందన్నారు. అందువల్ల మట్టి ప్రతిమలను వినియోగించడం బాధ్యతగా భావించాలని కోరారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. తలపెట్టిన పనులు విఘ్నాలు లేకుండా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చవితి ఉత్సవాలు, నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు.



నిడదవోలులో ఉత్సవాలకు సిద్ధమైన పూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం

నిడదవోలులో 105వ గణపతి నవరాత్రి ఉత్సవాలకు సర్వంసిద్ధం!

నిడదవోలు, సెప్టెంబరు 6: నిడదవోలు పట్టణంలో గణేష్‌చౌక్ సెంటరుగా పేరుపొందిన పూజా గణపతి కుమారస్వామి వార్ల ఆలయంలో 105వ గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయానికి 195 సంవత్సరాలుగా గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆనాటి తరం ప్రతినిధి సిరదే సత్యం నుంచి ఈనాటి తరం ప్రతినిధి కారింకి సాయిబాబు గణపతి నవరాత్రులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా క్రమశిక్షణతో నిర్వహిస్తున్నారు. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు ఈ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. స్వామి వారు ఈ ప్రాంతంలో వెలిసి ఉండడంతో ఈ ప్రాంతం గణేష్‌చౌక్ సెంటరుగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ జరిగే గణపతి నవరాత్రుల్లో రాష్ట్రంలోని పలుచోట్ల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ స్వామి వారి ఆశీస్సులు అందుకొంటుంటారు. శనివారం ప్రారంభం కాబోతున్న 105వ గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పూజా కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది.



ఎస్పీ నరసింహకిషోర్



విద్యార్థుల మృతితో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)



చింతా కార్తీక్ (ఫైల్)

లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి

- మృతులు పల్నాడు జిల్లా సీవల్లిపురం, శ్రీకాకుళం జిల్లా పలాసవాసులు
- దివాన్‌చెరువులో ప్రమాదం.. ఆరోగ్యం బాగా లేక ఆస్పత్రికి వెళుతుండగా ఘోరం
- శోకసంద్రంలో తోటి విద్యార్థులు





రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు వద్ద మునిగిన ఘాట్లు.. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద దిగువకు వదిలిన వరద నీటి ప్రవాహం

తగ్గుతున్న వరద

- గోదావరి నీటిమట్టం దిగువకు
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- ప్రస్తుత బ్యారేజీ నీటిమట్టం 12 అడుగులు
- బ్యారేజీ నుంచి 10,21,195 క్యూసెక్కులు సముద్రంలోకి
- భద్రాచలం వద్దమొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- మళ్లీ మూడు రోజుల పాటు వర్షాల హెచ్చరిక

ధవళేశ్వరం, సెప్టెంబరు 6: ఎగువ నుంచి వచ్చి చేరే వరద తగ్గుతూ ఉండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి తగ్గుముఖం పడుతోంది. గురువారం రాత్రి పది గంటలు దాటిన తరువాత నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతోపాటు 10 లక్షల క్యూసెక్కులు పైబడి వరద ప్రవహిస్తూ ఉండడంతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఆపై క్రమంగా నీటిమట్టం పెరుగుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు 12.30 అడుగుల వరకు చేరుకుంది. ఈ సమయంలో బ్యారేజీ నుంచి 10,63,085 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. ఆపై అదే రీడింగ్ వద్ద నాలుగు గంటలపాటు నిలకడగా ఉన్న నీటిమట్టం మధ్యాహ్నం మూడు గంటల నుంచి నెమ్మదిగా తగ్గడం ప్రారంభించి సాయంత్రం ఆరు గంటలకు 12.10 అడుగులకు చేరి దిగువకు 10,36,440 క్యూసెక్కులు ప్రవహించింది. మళ్లీ రాత్రి 11 గంటలకు నీటిమట్టం 12 అడుగులకు చేరడంతో 10,21,195 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఇదే ఒరవడి కొనసాగి బ్యారేజీ నుంచి డిశ్చార్జి అవుతున్న వరద నీరు 10 లక్షల క్యూసెక్కులకంటే తగ్గితే మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరిస్తారు. కాగా ఎగువన భద్రాచలం వద్ద వరద నీటిమట్టం శుక్రవారం ఉదయం 11 గంటలకు 42.90 అడుగులకు చేరడంతో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. రాత్రి 11 గంటలకు 41 అడుగులకు చేరింది.

కొవ్వూరు గోదావరి తీరంలో..

కొవ్వూరు, సెప్టెంబరు 6: నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొవ్వూరు వద్ద అఖండ గౌతమీ గోదావరి ఇంకా ఉరకలు వేస్తూనే ఉంది. శుక్రవారం కూడా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలను పూర్తిగా వరద ముంచెత్తుతూ ప్రవహించింది. ఎగువ నుంచి అధికంగా వరద నీరు నదిలో చేరడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీ ప్రవాహంలో వడి ఎక్కువగా ఉందని, వినాయక చవితిని పురస్కరించుకుని నదీస్నానాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు ముందస్తు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. వరద ప్రవాహం ఉధృతంగా ఉన్నందున తీర ప్రాంత ప్రజలు పుణ్యస్నానాలకుగాని, చేపలవేటకుగాని దిగరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో నెమ్మదిగా ఇక్కడా తగ్గుముఖం పడుతోందని ఏజీఆర్‌బీ ఏఈ ఆర్.సునీల్‌బాబు తెలిపారు. కాగా అల్పపీడనం వల్ల మరో మూడ్రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తాజాగా హెచ్చరించింది.





సమావేశంలో పాల్గొన్న అధికారులు.. పౌష్టికాహార స్టాల్స్‌ను సందర్శిస్తున్న సబ్ కలెక్టర్

బాల్య వివాహాలతో జరిగే నష్టాలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలి

కొవ్వూరు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, సెప్టెంబరు 6 : బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కొవ్వూరు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కొవ్వూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా డివిజన్ స్థాయి బాల్య వివాహాల నిలుపుదలపై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను సబ్‌కలెక్టర్ సందర్శించారు. సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు బాల్య వివాహాలు జరగకుండా కమిటీలు ఏర్పర్చామన్నారు. బాలిక విద్య పట్ల ఆసక్తి పెంచడానికి వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారితో సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సీడీపీవో మమ్మీలు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జి.దేవకుమార్, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు

రూరల్ గ్రామాల ముంపు సమస్యకు చెక్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 6: రూరల్ మండలం పరిధిలోని హుకుంపేట, బొమ్మూరు తదితర ప్రాంతాలకు వరద ముంపు సమస్య పరిష్కార దిశగా పనులు చేపట్టారు. రాజమహేంద్రవరం నగరంలోని కొన్ని ప్రాంతాలతోపాటు పిడింగొయ్యి, హుకుంపేట, బొమ్మూరు తదితర ప్రాంతాలకు సంబంధించి మురుగునీరు ఆవ కాలువ ద్వారా వెళుతూ ధవళేశ్వరం ప్రాంతంలోని సాయిబాబా గుడివద్ద గోదావరిలో కలుస్తోంది. అయితే ఆవ కాలువకు ఇరువైపులా పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతోపాటు గుర్రపు డెక్క తొలగించకపోవడంతో నీరు వెళ్లే మార్గంలేక బొమ్మూరు, హుకుంపేట, ధవళేశ్వరం తదితర గ్రామాలకు చెందిన కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు కూడా మునిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ముంపు ప్రాంతాలను క్షేత్రస్థాయి పరిశీలన చేసిన కలెక్టర్ పి.ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కాలువ సర్వే చేపట్టి ఆక్రమణలను తొలగించాలంటూ అధికారులను ఆదేశించారు. కాలువ ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహించుకుంటున్న నిర్వాహకులు ప్రముఖులు కావడంతో వారి జోలికి ఎవరూ పోలేదు. హుకుంపేట నుంచి ధవళేశ్వరం వరకు 37చోట్ల సుమారు 6 ఎకరాల మేర కాలువ ఆక్రమించి వ్యాపార సంస్థలు, ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచే రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహశీల్దార్ రమ్య, ఈవోపీఆర్డీ రాంబాబు, గ్రామ కార్యదర్శి వెంకట్రావు, మండల సర్వేయర్ శ్రీనివాసరెడ్డి, వీఆర్‌వోలు, సచివాలయ సర్వేయర్ల సాయంతో ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే బత్తుల రూ.25 లక్షల విరాళం

ఫ్లైల్

హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనంలో చిరుత సంచరించిందని పుకార్లు

- అప్రమత్తమైన అటవీ సిబ్బంది.. విస్తృత గాలింపు
- ఆర్ఎఫ్ఆర్‌సీలో అమర్చిన ట్రాప్ కెమెరాలు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కొవ్వూరులో రైళ్ల హాల్ట్‌లు పునరుద్ధరించాలి

కేంద్ర రైల్వేమంత్రికి పోస్టుకార్డులు రాసిన ఏబీఎన్ విద్యార్థులు



కేంద్ర రైల్వే మంత్రికి పోస్టుకార్డులు పంపుతున్న ఏబీఎన్ కళాశాల విద్యార్థినులు

కొవ్వూరు, సెప్టెంబరు 6: కొవ్వూరు రైల్వేస్టేషన్‌ల్లో 2019 కొవిడ్ సమయంలో రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని ఏబీఎన్&పీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు పోస్టుకార్డులు రాశారు. శుక్రవారం కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏబీఎన్ కళాశాలలో మన కొవ్వూరు-మన బాధ్యత కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులు కేంద్ర మంత్రికి పోస్టుకార్డులు రాసి పంపించారు. కార్డుల్లో- కొవ్వూరు రైల్వేస్టేషన్‌ల్లో రైళ్లు ఆగడం లేదని, బస్టాండ్‌కు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడం లేదని, కళాశాల వద్ద బస్‌లు నిలుపుదల చేయకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక రైల్వేస్టేషన్‌ల్లో కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మాధవిని కలిసి రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో విల్సన్‌రాజు, టీడీఎల్ ప్రసాద్, పడాల సుబ్బారెడ్డి, కేవీ రమణ, తరుణ్, రమేష్, వల్లూరి రవి, కృష్ణప్ప, గారపాటి రామ్మోహన్, వైకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి మంగళవారం 'జనవాణి'

వరద బాధితులకు 10టన్నుల బియ్యం సేకరించాలి

జనసేన నియోజకవర్గ సమావేశంలో సువర్ణరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన కన్వీనర్ సువర్ణరాజు

నల్లజర్ల, సెప్టెంబరు 6: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో ప్రతి మంగళవారం జనవాణి నిర్వహించనున్నట్టు పార్టీ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆవపాడులో జనసేన జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ ఇంటి వద్ద జరిగిన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవాణిలో వచ్చిన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తామన్నారు. అలాగే విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి గ్రామం నుంచి బియ్యం సేకరించాలన్నారు. నియోజకవర్గం నుంచి 10టన్నుల బియ్యం సరఫరా చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అనిశెట్టి గంగరాజు, సనారీ, మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, రుద్ర శ్రీను, కాట్నం గణేశ్, దాకారపు నరసింహమూర్తి పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ పథకంపై అవగాహన సదస్సు

తాళ్లపూడి, సెప్టెంబరు 6: ప్రభుత్వం గిరిజన సంచార జాతుల ప్రజల కోసం అమలు చేస్తున్న పీఎం జన్‌మన్ పథకంపై మండలంలోని పోచవరం పరిధిలోని తుపాకులగూడెంలో శుక్రవారం సర్పంచ్ కాకర్ల హేమలత అధ్యక్షతన ఎంపీడీవో వెంకటరమణ అవగాహన సమావేశం నిర్వహించారు. సంచార జాతులు, గిరిజనులకు ప్రభుత్వం పక్కా ఇళ్లు కట్టించి ఇస్తుందని, నీటికుళాయి, విద్యుత్ సౌకర్యం, జీవనోపాధి, ఆరోగ్యం, పౌష్టికాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తోందని ఎంపీడీవో చెప్పారు. గ్రామంలో 12 సంచార జాతుల కుటుంబాలు ఉన్నాయని కార్యదర్శి రామలక్ష్మి తెలిపారు. సమావేశంలో ఆరోగ్యశాఖ, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన రవిచంద్రన్

నిడదవోలు, సెప్టెంబరు 6: సేవా కార్యక్రమాల్లో వాసవి వనితాక్లబ్ అగ్రభాగాన నిలుస్తోందని ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్ అన్నారు. శనివారం నిడదవోలులోని వాసవి వనితాక్లబ్‌కు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పర్యటన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక లిటిల్ ప్యారడైజ్ పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆర్.రవిచంద్రన్ వనితాక్లబ్ మహిళలు విద్యా వైద్య రంగాల్లో సమాజానికి అందిస్తున్న సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సింహాద్రి శిరీష, గొల్లపూడి గాయత్రి, జవ్వాది శిరీష, జయవరపు లక్ష్మి, మడిపల్లి భాస్కరం, వీఎల్ఎన్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

చాగల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వరప్రసాద్

చాగల్లు, సెప్టెంబరు 6: చాగల్లు ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా జొన్నకూటి వరప్రసాద్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా జుట్టు క్రిష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేవీవీ నారాయణ, కార్యదర్శిగా వనచర్ల వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా వేండ్ర వెంకట శ్రీనివాస్, సభ్యులుగా వి.హరిప్రసన్న, ఎస్.దుర్గాప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షుడు వీవీవీ శ్రీనివాస్‌ను సన్మానించారు. నూతన కార్యవర్గం సమావేశంలో అధికారులు విలేఖరులకు సమాచారం సక్రమంగా సకాలంలో అందించాలని తీర్మానించారు. విజయవాడ వరదల్లో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



చరణ్(ఫైల్)

దేవరపల్లి, సెప్టెంబరు 6: మండలంలోని యర్నగూడెం శివారు గండిచెరువు మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తానుకొండ చరణ్(20) మృతి చెందాడు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యుల వివరాల మేరకు యర్నగూడెం గ్రామానికి చెందిన చరణ్ శుక్రవారం గ్రామ శివారులోని పెట్రోల్ బంకుకు వెళ్లి బైక్‌లో పెట్రోల్ కొట్టించుకుని ఇంటికి వస్తుండగా యర్నగూడెం నుంచి నల్లజర్ల వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో చరణ్‌కు తీవ్రగాయమైంది. తలకు తీవ్రగాయం కావడంతో పాటు చేయి శరీరం నుంచి వేరైంది. దీంతో అతడిని రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. తండ్రి పదేళ్ల క్రితం చనిపోగా తల్లికి పేయింటర్‌గా పనిచేస్తూ చేదోడువాదోడుగా ఉంటున్నాడు. చరణ్ మృతితో తాను దిక్కులేని దానినయ్యానని తల్లి కన్నీరుమున్నీరయ్యింది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటీ ధ్వంసం

కొవ్వూరు, సెప్టెంబరు 6: గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటీ ధ్వంసమైన ఘటనపై కేసునమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. 2024 జూన్ 15న కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన సుంకవల్లి త్రిమూర్తులు భార్యతో కలిసి కొవ్వూరు నుంచి వాడపల్లికి స్కూటీపై వెళ్తున్నాడు. వాడపల్లి ఇసుకర్యాంపు సమీపంలో పాన్‌షాపు వద్ద ఆగి కూల్‌డ్రింకు తాగుతుండగా గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొని వెళ్లిపోయింది. పోలీసులకు ఏవిధంగా ఫిర్యాదుచేయాలో తెలియకపోవడంతో ఆలస్యంగా శుక్రవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో త్రిమూర్తులు ఫిర్యాదుచేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

గోపాలపురం, సెప్టెంబరు 6: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సంధ్యా అన్నారు. శుక్రవారం గోపాలపురం జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సిబ్బంది అందించాల్సిన సేవలతో పాటు పరిసర ప్రాంత మహిళలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఎంవో వెంకటేశ్వరరావు, మురళీకృష్ణరెడ్డి, హెచ్‌వీ పద్మా, ఎంఎల్‌హెచ్‌పీ నవీన్, ఎంపీహెచ్‌ఏ వెంకటేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

10న కొవ్వూరులో జాబ్‌మేళా

కొవ్వూరు, సెప్టెంబరు 6: కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఈ మేళాలో టీవీఎస్, ఎంజీ మోటార్స్, హెటిరో ల్యాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీతోపాటు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎంసీఏ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. 10వ తేదీ ఉదయం 9గంటలకు కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 73062 32373(ఎం.కొండలరావు) నెంబరును సంప్రదించాలన్నారు.

చవితికి ఘనంగా ఏర్పాట్లు



కొవ్వూరులో వినాయకుడి మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం

- చాగల్లులో వైభవంగా నిర్వహించేందుకు తెలగా సంఘం, వర్తక సంఘాల సమాయత్తం
- పలుచోట్ల వినాయక మట్టి ప్రతిమల పంపిణీ

చాగల్లు, సెప్టెంబరు 6: మండల కేంద్రమైన చాగల్లు వినాయక చవితి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గణేష్ ఉత్సవాలకు చాగల్లు ప్రసిద్ధి. చాగల్లు తెలగా సంఘం, చాగల్లు, నెలటూరు వర్తక సంఘం ఆధ్వర్యంలో వేరువేరుగా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. గణపతి నవరాత్రులు సందర్భంగా సాంఘిక, పౌరాణిక, జానపద నాటికతో పాటు సంగీత విభావరి వంటి కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహిస్తారు. సినీనటులు సైతం ఈ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. కాగా వినాయకచవితి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఏవీ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజించాలి

కొవ్వూరు, సెప్టెంబరు 6: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం కొవ్వూరులోని గౌతమీనగర్‌లో పిల్లలమర్రి లక్ష్మీనారాయణశర్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీచేశారు. ట్రస్టు నిర్వాహకులు పిల్లలమర్రి సర్వేశ్వరరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ 14 ఏళ్ల ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల అందులోని రసాయనాలు నీటిలో కలిసి రోగాల బారిన పడతారని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, ముప్పరాజు శ్రీనివాసరావు, సీహెచ్ సాయిరాజు పాల్గొన్నారు. అలాగే మెయిన్‌రోడ్‌లోను, మండలంలోని పశివేదల గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ కంటమణి రామకిషోర్, ముళ్లపూడి కాశీవిశ్వనాథ్, మన్యం బుల్లిబాబు పాల్గొన్నారు.

తాళ్లపూడి: గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ తెలిపారు. కార్యక్రమంలో వి.చంద్రయ్య, సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, చెరుకు ఆంజనేయులు, జగదీష్, వీజేపీ వెంకటేశ్వరరావు, శ్రీలక్ష్మి, లద్దిక రమకృష్ణ పాల్గొన్నారు.

పెరవలి: వినాయక చవితి ఉత్సవాలకు పలు గ్రామాల్లో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. మండపాలు ఏర్పాటు చేసి విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పిల్లలు కూడా ఎంతో ఉత్సాహంగా వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. తీపర్రుకు చెందిన గ్రంధి రాము పదేళ్లుగా ఉత్సవాల నిమిత్తం విగ్రహాన్ని బహూకరిస్తున్నారు. ఈ ఏడాది కూడా విగ్రహాన్ని అందించారు.

దేవరపల్లి: దేవరపల్లిలో గ్రామ పురోహితులు పెడసనగంటి సాయిబాబు, పెడసనగంటి శశికాంత్ శర్మ ఆధ్వర్యంలో పెడసనగంటి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టివినాయక విగ్రహాలను పరమేశ్వర బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీ ఎండీ తేతల ఉపేంద్రారెడ్డి పంపిణీ చేశారు.



తాళ్లపూడిలో వినాయకుడి మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పూజా సామగ్రి కొనుగోళ్ల కోలాహలం



దేవరపల్లి/కొవ్వూరు, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా దేవరపల్లి, కొవ్వూరు మెయిన్‌రోడ్ శుక్రవారం పూజా సామగ్రి కొనుగోలుదారులతో కోలాహలంగా మారింది. స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి విజయవిహార్ వరకు కొవ్వూరమ్మ గుడి నుంచి జూనియర్ కాలేజ్, బస్టాండ్ సెంటర్ ఆంజనేయస్వామి గుడి వద్ద పత్రి, పండ్లు, పాలవెల్లి, వివిధరకాల పూజా సామగ్రి దుకాణాలు ఏర్పాటుచేశారు. ప్రజలు సామగ్రి కొనుగోలు చేసేందుకు రావడంతో రోడ్లన్నీ కోలాహలంగా మారాయి. పండుగను ఆసరాగా తీసుకుని వ్యాపారులు, పువ్వులు, పండ్ల ధరలను పెంచి విక్రయించడంతో సామాన్యులు పండుగ చేసుకోవాలంటే హడలెత్తిపోతున్నారు. .

వినాయకుడి మట్టి ప్రతిమ ధర రూ.60



నల్లజర్ల, సెప్టెంబరు 6: వినాయక మట్టి ప్రతిమల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. చిన్న సైజు ప్రతిమ సైతం రూ.60 నుంచి రూ.70కు విక్రయిస్తున్నారు. అలాగే పూజకు వినియోగించే మారేడు, వెలగపండు, సీతాఫలం,బత్తాయి వంటి ఫలాల రేట్లు కూడా అధికంగానే ఉన్నాయి. ఒక్కోటి రూ.10 ధర పలుకుతోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది ధరలు మరింత పెరిగాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.

వరద బాధితులకు చేయూత



పెరవలి నుంచి ఆహార పొట్లాలు తరలిస్తున్న దృశ్యం

పెరవలి, సెప్టెంబరు 6: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం పలువురు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో పెరవలి పంచాయతీ ఉప సర్పంచ్ కుక్కల సాయిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడకు ఆహార పొట్లాలు తీసుకెళ్లారు. ముంపు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్వయంగా పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐ వల్లభనేని పవన్‌కిషోర్, వీరవల్లి దుర్గాప్రసాద్, కోళ్ల గణేష్, కాకరపర్తి రాము, కడలి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బత్తుల రూ.25 లక్షల విరాళం

రాజానగరం, సెప్టెంబరు 6: విజయవాడ పరిసర ప్రాంత వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శుక్రవారం రూ.25లక్షలు విరాళంగా ప్రకటించారు. వరద బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాను అందించిన అనేక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. తన భార్య వెంకటలక్ష్మి, కుమార్తెలు, అల్లుడు నిర్ణయం మేరకు నియోజకవర్గం తరఫున రూ.25 లక్షలు విరాళంగా అందజేశామన్నారు. వరద బాధితులకు ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎనలేని సేవలందించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజానగరం నియోజకవర్గంలోని దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితుల సహాయార్థం తమ విరాళాలను చెక్కు రూపంలోగానీ, డీడీ రూపంలో గానీ సీఎం సహాయనిధికి విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు.

నల్లజర్ల: వరద బాధితులకు యర్నగూడెం, అయ్యవరం త్రీఎఫ్ ఆయిల్ ఫాం కంపెనీ రూ.5 లక్షలు విలువ చేసే 5వేల వాటర్ బాటిల్స్, రూ.30 వేల తినుబండార ప్యాకెట్స్‌ను వ్యాన్‌లో విజయవాడ తరలించారు. అక్కడి డిప్యూటీ కలెక్టర్ ములుగు మాధురికి, అక్కడే ఉన్న ఎమ్మెల్యే మద్దిపాటికి అప్పగించారు. వారి పర్యవేక్షణలో త్రీఎఫ్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్యాక్టరీస్ త్రినాథరావు, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, త్రీఎఫ్ ఆయిల్ ఫాం బృందం ప్రజలకు అందజేసినట్టు త్రీఎఫ్ ఆయిల్ ఫాం యాజమాన్యం తెలిపింది.

వరద బాధితుల సహాయనిధి

గోపాలపురం, సెప్టెంబరు 6: సీఎం చంద్రబాబు ఆదేశానుసారం విజయవాడలోని 21వ డివిజన్‌లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుచేపట్టిన సహాయక చర్యలు శుక్రవారం 5వ రోజుకు చేరుకున్నాయి. బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులను ఎదుర్కొవడం సమర్థవంతంగా ప్రజలను కాపాడి సేవా దృక్పథాన్ని ఇతరుల్లో ఇనుమడింప జేసే సామర్థ్యం టీడీపీ అధినేత చంద్రబాబులోనే ఉందన్నారు. ఇదిలా ఉండగా విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం గ్రామంలో విరాళాలు సేకరిస్తున్నట్టు టీడీపీ బీసీసెల్ మండలాధ్యక్షుడు వేముల నాగరాజు తెలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పిలుపుతో మండలంలోని కరిచర్లగూడెంలో వరద బాధితుల సహాయనిధి టీడీపీ, జనసేన నాయకులు జోలిపట్టి ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. రూ.25వేలు సేకరించినట్టు నాగరాజు తెలిపారు. ఈ మొత్తాన్ని పార్టీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణకు అందజే యనున్నామని చెప్పారు. కార్యక్రమంలో పటాన్ ము గ్బుల్ బాష, త్రిమూర్తులు, వడ్లమూడి సూర్యనారా యణ, పటాన్ రహీం, వామిశెట్టి స్వామి, మీసాల త్రిమూర్తులు పాల్గొన్నారు. అలాగే దొండపూడిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ముత్యాల రాయుడు ఆధ్వ ర్యంలో రూ.14,100 సేకరించారు. ఆయన వెంట వెల్లంకి జయశివసూర్యం, పంది సోమరాజు, శ్రీను, రాగూర్ ముసలయ్య, గౌరీ పోసమ్మ, ముప్పిడి అనీల్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.



బాధితులకు బియ్యం అందజేస్తున్న మద్దిపాటి

నిత్యావసర వస్తువుల అందజేత

కొవ్వూరు, సెప్టెంబరు 6: విజయవాడ 20వ డివిజన్ కృష్ణలంకలో వరద ముంపు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నాలుగో రోజు పాల్గొన్నారు. శుక్రవారం ముంపు ప్రాంతాల్లో బాధితులకు అందుతున్న సేవలను అక్కడి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. 20వ డివిజన్‌లో 11 రకాల నిత్యావసర వస్తువులున్న ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాల ద్వారా సేవలందించడంతో పాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ కె.మాధవీలత, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న ముప్పిడి

కబళించిన మృత్యువు



విద్యార్థుల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, తోటి విద్యార్థులు

- లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి
- దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్ద ఘటన

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6: జాతీయరహదారిపై తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో పల్నాడు జిల్లా సీవల్లిపురం గ్రామానికి చెందిన చింతకార్తీక్(19), శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రోణంకి ప్రవీణ్(21) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరిద్దరూ ఇక్కడకు సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి బొమ్మూరు ఎస్ఐ అంకారావు శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. వీరు బ్రిడ్జి కౌంటీలోని ఒక రూమ్‌లో ఉంటున్నారు. ప్రవీణ్‌కు ఒంట్లో బాగోకపోవడంతో ఇద్దరు గురువారం రాత్రి స్కూటీపై ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా వీరిని ఢీకొని కొద్ది దూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఇద్దరి శరీరభాగాలు తెగి రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ఆప్రాంతమంతా రక్తసిక్తమైంది. సమాచారం అందుకున్న వెంటనే బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకోగా డ్రైవరు పరారీలో ఉన్నాడన్నారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అంకారావు తెలిపారు.

సహచర విద్యార్థుల దిగ్ర్భాంతి

శవపరీక్ష అనంతరం విద్యార్థుల భౌతికకాయాలు తీసుకువెళ్తున్న అంబులెన్స్‌లను వారు చదువుతున్న కళాశాల ప్రధానద్వారం వద్దకు తీసుకు వచ్చి కొద్దిసేపు ఉంచారు. నిన్నటి వరకూ తమతో కలసి ఉన్న విద్యార్థులు రోడ్‌ప్రమాదానికి గురై తిరిగి రానిలోకాలకు చేరుకోవడంతో సహచరవిద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.

ఒక్క కొడుకూ దూరమయ్యాడు..

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6: ఎన్నో ఆశలతో ఇంజనీరింగ్ చదివిస్తున్న తన ఒక్కగానొక్క కొడుకు దూరమయ్యాడని దివాన్‌చెరువు వద్ద లారీ ఢీ కొన్న దుర్ఘటనలో మృతి చెందిన చింత కార్తీక్ తండ్రి వీరాంజనేయులు రోదించడం అక్కడున్న వారిని కలచివేసింది. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఇంజనీరింగ్ విద్యార్థులు చింత కార్తీక్, రోణంకి ప్రవీణ్ మృతదేహాలకు శుక్రవారం రాజమహేంద్రవరంలోని జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. కాగా, వీరాంజనేయులు వ్యవసాయం చేస్తుంటారు. ప్రమాదం వార్త తెలియగానే పలాస నుంచి ప్రవీణ్ కుటుంబ సభ్యులు, వినుకొండ నుంచి కార్తీక్ కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజమహేంద్రవరం చేరుకున్నారు. కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆసుపత్రి మార్చురీ వద్దకు గైట్‌కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొందరు విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

అదిగో పులి!

- హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనం మధ్య చిరుతపులి సంచరించిందని పుకార్లు
- అప్రమత్తమైన అటవీ సిబ్బంది
- విస్తృత గాలింపు
- స్థానిక ఆర్ఎఫ్ఆర్‌సీలో ట్రాప్ కెమెరాల ఏర్పాటు



దివాన్‌చెరువు, సెప్టెంబరు 6: చిరుతపులి సంచరిస్తోందన్న వార్తలు నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనం మధ్య గురువారం అర్ధరాత్రి సమయంలో చిరుతపులి సంచరించిందన్న వార్తలు కలకలం రేపాయి. దీంతో అటవీసిబ్బంది, స్థానిక రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఉద్యోగులు శుక్రవారం ఉదయం నుంచి గోదావరి మహాపుష్కరవనం, దాని సమీపంలోని అటవీ పరిశోధనా సంస్థ(ఆర్ఎఫ్ఆర్‌సీ) పరిసరాల్లో విస్తృతంగా గాలించారు. కొన్ని అనుమానాస్పద అడుగుజాడలు కనిపించాయని, అయితే ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా నేల బురదగా ఉండడంతో తమకు లభించిన అడుగు జాడలను వారు నిర్ధారించలేకపోయారు. కాగా అనుమానాస్పద అడుగుజాడలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పెగ్ మార్క్ చేసినట్టు దివాన్‌చెరువు సెక్షన్ డీఆర్వో పద్మావతి తెలిపారు. అలాగే ఎనిమిది ట్రాప్ కెమెరాలును రప్పించామని, ఆర్ఎఫ్ఆర్‌సీ వద్ద మరియు అనుమానాస్పద పాదముద్ర లభించిన పరిసరాలలో వాటిని అమర్చుతున్నామన్నారు.